


'ట్రిపుల్‌ఐటీ' నోటిఫికేషన్ విడుదల
ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో నూతన విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి వర్సిటీ అధికారులు సోమవారం ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. 8లో▸



'భగీరథ'కు నీటిగండం
కడెం ప్రాజెక్టులో గతంలో ఎన్నడూ లేనివిధంగా నీటిమట్టం పూర్తిగా తగ్గడంతో ఇంటెక్‌వెల్‌కు నీరందేలా అధికారులు పొక్లెయిన్‌తో కాలువ తీయిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
42.0 /30.0

వాతావరణం
జిల్లాలో చాలా వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తీవ్రమైన వేడి, ఉక్కపోత ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సూర్యాపూర్ ఆలయంలో మహారాష్ట్ర రైతుల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న రైతులు

కుంటాల: ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్ నగర్ తాలూకా పోనం గ్రామానికి చెందిన రైతులు సోమవారం సూర్యాపూర్ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకం, అన్న పూజ, సత్యనారాయణ వ్రతం ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంటిల్లిపాది సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

'పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి'



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్, డీఈవో కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జనవరి నుంచి ఇప్పటి వరకు కోడిగుడ్ల బిల్లులు కూడా విడుదల చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం కనీస వేతనం రూ.10 వేలు, వంటసామగ్రి, యూనిఫామ్ అలవెన్స్, వంటషెడ్లు సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బుక్యా రమేశ్, చిట్యాల లక్ష్మి, ఏనుగుల లక్ష్మి, సంగ్వి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో జనరల్ వర్క్, సూపర్‌వైజర్, వెల్డింగ్, ఎలక్ట్రీషియన్, పైపు ఫిట్టర్, ప్లంబింగ్, పెయింటింగ్ అండ్ డెకొరేషన్ తదితర కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. భోజనంతోపాటు యూనిఫామ్, శిక్షణ సామగ్రి అందిస్తామని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెల్: 9154548063, 8328507232 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమష్టి కృషి ఫలితమే వేతనాల పెంపు



మాట్లాడుతున్న రాజన్న

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు పెరగడం సమష్టి కృషి ఫలితమే అని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రాజన్న అన్నారు. కార్మికుల వేతనాలు పెరిగిన సందర్భంగా బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో బీడీ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు టపాకాయలు పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం బీడీ వర్కర్స్ ప్యాకింగ్ జిల్లా కార్యదర్శి కిషన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో నాయకులు మాట్లాడుతూ పెరిగిన వేతనాలు మే నెల నుంచి అమలులోకి వస్తాయన్నారు. 1000 బీడీలకు రూ.4.25 పైసలు, బీడీ ప్యాకర్లకు నెలకు రూ.3,650, నెలసరి ఉద్యోగులకు రూ.1,700 వేతనం పెరిగినట్లు తెలిపారు. ఈ అగ్రిమెంటు 2026 వరకు అమలులో ఉంటుందని, రాష్ట్రంలో ఏడు లక్షల మందికి వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే.లక్ష్మి, గంగామణి, రాజేందర్, ఎల్లయ్య, రవి, వెంకటి, లక్ష్మణ్, కే.రాజు, మురళి, చిన్నయ్య, రవి, కమల, కవిత, నరసవ్వ, తదితరులు పాల్గొన్నారు.



తొమ్మిదింటికే బడిగంట

- పాఠశాలల పనివేళల్లో మార్పుచేసిన విద్యాశాఖ
- ప్రతీనెల నాలుగో శనివారం 'నో బ్యాగ్ డే'
- జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- పాఠశాల విద్య అకాడమిక్ క్యాలెండర్ విడుదల

నిర్మల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళల్లో మార్పు చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత బడుల పనివేళలను మళ్లీ మార్చింది. జూన్ 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు తాజాగా పాఠశాల విద్య అకాడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటలకే బడిగంట మోగనుంది. 2022–23 విద్యా సంవత్సరం వరకు ఈ పాఠశాలలు ఉదయం 9 గంటలకే తెరుచుకునేవి. కానీ గతేడాది 9:30 గంటలకు ప్రారంభమయ్యేలా షెడ్యూల్ మార్చారు. మళ్లీ ఇప్పుడు ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని 9 గంటలకే ప్రారంభించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభంకాగా సాయంత్రం 4:45 గంటల వరకు నిర్వహిస్తారు.

నూతన అకాడమిక్ క్యాలెండర్ విడుదల

విద్యాశాఖలో ఏటా బడులు ప్రారంభమైన రెండు నెలల తర్వాత అధికారులు నూతన అకాడమిక్ క్యాలెండర్ విడుదల చేసేవారు. కానీ ఈసారి మాత్రం ఇందుకు భిన్నంగా బడులు ప్రారంభానికి 20 రోజుల ముందుగానే విడుదల చేశారు. దీని ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు పనిచేస్తాయి.

నాలుగో శనివారం నో బ్యాగ్ డే...

బడుల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బరువు కంటే వారి పుస్తకాల బరువు ఎక్కువగా ఉంటుందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో చిన్నారులకు వెన్నెముక సమస్యలు వస్తున్నాయని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల స్కూల్ బ్యాగ్‌పై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు చేయనుంది. నెలలో ఓ రోజును ×నో బ్యాగ్‌డే×గా ప్రకటించింది. ప్రతీనెల నాలుగో శనివారం విద్యార్థులు పాఠశాలకు పుస్తకాలు లేకుండా రావాల్సి ఉంటుంది. ఆరోజు బోధనకు సంబంధించి ఎస్సీఈఆర్టీ ప్రత్యేక ప్రణాళిక ప్రకటించనుంది. ఆటపాటలతో చదువు చెప్పే విధానానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ విధానాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గత విద్యా సంవత్సరం కూడా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకురాగా జిల్లాలో ఎక్కడా అమలైన దాఖలాలు లేవు. ఈ ఏడాదైనా అధికారులు పకడ్బందీగా చేపడతారా? లేదా? అనేది వేచిచూడాల్సి ఉంది.

12న పాఠశాలలు పునఃప్రారంభం

నూతన విద్యాసంవత్సరం జూన్ 12న ప్రారంభమై 2025 ఏప్రిల్ 23 వరకు కొనసాగుతుంది. ఇందుకు సంబంధించిన అకాడమిక్ క్యాలెండర్‌ను పాఠశాల విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. మొత్తంగా పాఠశాలలకు 229 పనిదినాలు ఉంటాయి. రోజు 90 శాతానికి పైగా విద్యార్థుల హాజరు ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతీరోజు 30 నిమిషాల పాటు పాఠ్య పుస్తకాలు, కథల పుస్తకాలు, దినపత్రికలు, మ్యాగజైన్లు చదివించాలి. టీవీ పాఠాలను యథావిధిగా ప్రసారం చేయాలి. విద్యార్థులతో ఐదు నిమిషాల పాటు యోగ ధ్యానం చేయించాలి. ఎఫ్‌ఏ–1పరీక్షలు జూలై 31 లోపు, ఎఫ్‌ఏ–2 సెప్టెంబర్ 30 లోపు, ఎస్‌ఏ–1 అక్టోబర్ 28 లోపు, ఎఫ్‌ఏ–3 డిసెంబర్ 17 లోపు, ఎఫ్‌ఏ–4 పదోతరగతికి జనవరి 29, ఇతర తరగతులకు ఫిబ్రవరి 28 నాటికి, ఎస్‌ఏ–2 ఏప్రిల్ 19 లోపు పూర్తి చేయాలి. ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ఉంటాయి.

జిల్లాలోని పాఠశాలల వివరాలు

పాఠశాలలు	సంఖ్య
ప్రాథమిక పాఠశాలలు	533
ప్రాథమికోన్నత	85
ఉన్నత పాఠశాలలు	117
మొత్తం	735
విద్యార్థుల సంఖ్య	52,667

జూన్ 1 నుంచి 'బడిబాట'

సర్కార్ బడుల్లో బడిబాట షెడ్యూల్‌ను విద్యాశాఖ ఖరారు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు జూన్ 1 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నా ఉన్నత పాఠశాలల్లో మాత్రం క్రమక్రమంగా తగ్గుతోంది. ఈసారి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి హామీ పనిస్థలాలకు, ఇంటింటికీ వెళ్లడం, గ్రామ సభలు నిర్వహించడం, తదితర ఆక్టివిటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల అనుభవం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరిస్తారు.

సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వం ముందస్తుగా అకాడమిక్ ప్లానింగ్ ప్రకటించడం స్వాగతిస్తున్నాం. చదువుతో పాటు బడుల్లో మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపరచాలి. కోవిడ్ తర్వాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రమక్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఉపాధ్యాయుల సమస్యలు కూడా పరిష్కరిస్తే మరింత వృద్ధి సాధించే అవకాశం ఉంది.
– రవికాంత్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పుస్తకాలు, యూనిఫాం ఇవ్వాలి



ప్రభుత్వం ప్రకటించిన విద్య అకాడమిక్ క్యాలెండర్‌ను స్వాగతిస్తున్నాం. బడులు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం కూడా ఇవ్వాలి. బడిబాటలో పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ఎర్నింగ్ లివ్ (ఈఎల్) సదుపాయం కల్పించాలి. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై అధికారులు మరింత సమీక్ష చేయాలి.
– భూమన్న యాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఓట్ల లెక్కింపులో పొరపాట్లు జరగకుండా చూడాలి

- కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల ప్రక్రియలో ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్నిరకాల చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఎన్నికల అధికారులతో సోమవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జూన్ 4న జరిగే లోకసభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మల్ జిల్లాలోని 3 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఆదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతీరౌండ్‌కు డేటా ఎంట్రీ నమోదు చేసి సమాచారం అందిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

సోన్: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సీవోఈ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని గాంధీనగర్ ఎస్సీ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్, గురుకుల సొసైటీ జిల్లా సమన్వయ అధికారి ఎం.సరస్వతి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హెచ్ఈసీ, సీఈసీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపు పకడ్బందీగా చేపట్టాలి




మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నిర్మల్ జిల్లా ఓట్ల లెక్కింపును ఆదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ అధికారులు జూన్ 4వ తేదీన ఉదయం 5.30 నిమిషాలకు ఓట్ల లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించాలని, ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమయానికి కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభించాలని, అనంతరం ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కించాలని ఆదేశించారు. రౌండ్ల వారీగా లెక్కించిన ఓట్ల వివరాలను తెలిపేందుకు స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపు సమయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత ఏఆర్వోలకు సమాచారం అందించాలన్నారు. రౌండ్లవారీగా లెక్కింపు పూర్తికాగానే సంబంధిత ఫారాలన్నీ జాగ్రత్తగా నింపాలన్నారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ సిబ్బందికి ఓట్ల లెక్కింపు సరళిని, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో నిర్మల్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, శ్యామలాదేవి, నిర్మల్, భైంసా, ఉట్నూర్ ఆర్డీవోలు రత్న కళ్యాణి కోమల్‌రెడ్డి, జీవాకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రైతాంగ సమస్యలు పరిష్కరించాలి'

నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతాంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. నిర్మల్ పట్టణంలోని ప్రజాసంఘాల భవన్ లో సోమవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని, సమగ్ర భూసర్వే నిర్వహించి లోపాలను సవరించాలని, రెవెన్యూ రికార్డుల్లో కౌలురైతులు, వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేసేందుకు 'కాలం' ఏర్పాటు చేయాలని, 2011 కౌలుచట్టాన్ని అమలు చేయాలని, సాగుదారులందరికీ ప్రభుత్వం ప్రకటించిన రూ.12,500 సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రూపొందించి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల పరిహారం ఇవ్వాలన్నారు. కల్తీ విత్తనాలను పట్టుకోవడమే తప్పా నేరస్తులపై ఎలాంటి శిక్షలు, నష్టపోయిన రైతులకు పరిహారాలు లేవన్నారు. వెంటనే ప్రభుత్వం రాష్ట్ర విత్తన చట్టాన్ని రూపొందించి కల్తీ విత్తన సంస్థల కంపెనీలను రద్దు చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూరు తిరుపతి, రైతు సంఘం నాయకులు సుంచుల నారాయణ, జాదవ్ మోతీరాం, కిషన్ జాదవ్, పెద్ద గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూడ్ శోభన్

సేవల సౌలభ్యానికి సర్వే

- అంగన్‌వాడీ సేవలపై కుటుంబ సర్వే
- పలు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- అవకతవకలకు చెక్

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం కుటుంబ సర్వే చేపడుతోంది. కేంద్రాల ద్వారా అందించే పాలు, గుడ్లు, బాలామృతం వంటివి లబ్ధిదారులకు చేరకుండానే చేరినట్లు రికార్డుల్లో రాసే విధానానికి చెక్ పెట్టనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం 'న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం' పేరిట సర్వే చేపడుతోం ది. మార్చి నుంచే ప్రక్రియ ప్రారంభం కాగా ఎన్నికల నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం సర్వే పనుల్లో వేగం పెంచారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

సర్వే ఆధారంగా వివరాలు సేకరించిన సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన రెండు రకాల యాప్‌లలో సర్వేను ఒకేసారి పొందుపరుస్తున్నారు. కేంద్రాన్ని ఆధారంగా చేసుకుని ఇంటినంబర్, కాలనీ పేరు, చిన్నారులు, తల్లిదండ్రులు గర్భిణులు, బాలింతలు, జనన, మరణాలు, ఇల్లు, ప్రస్తుతం ఉన్న కేంద్రం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. సర్వే అనంతరం కేంద్రాలకు సంబంధించి ఇళ్ల సర్దుబాటు ప్రక్రియ చేపడుతారు. కేంద్రానికి దూరంగా ఉండే ఇళ్లను సమీపంలో ఉన్న కేంద్రానికి దూరంగా ఉండే ఇళ్లను సమీపంలో ఉన్న కేంద్రానికి బదిలీ చేస్తారు.

సర్వే లక్ష్యం ఇదే..

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారికి ఒక పూట సంపూర్ణ భోజనం అందిస్తున్నారు. ఇందులో బాలింతలు, గర్భిణులకు రోజుకు బియ్యం 150 గ్రాములు, కందిపప్పు 30 గ్రాములు, నూనె 16 గ్రాములు, పాలు 200 మిల్లీ గ్రాములు, ఒక గుడ్డు ఇవ్వాలి. పిల్లలకు బియ్యం 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, నూనె 5 గ్రాములు, మూడేళ్ల లోపు పిల్లలకు 16 గ్రాములు, ఆపై వయస్సు వారికి పనిరోజులు పరిగణనలోకి తీసుకుని రోజుకు ఒక గుడ్డు అందిస్తారు. సర్వేలో భాగంగా కుటుంబాల సంఖ్య, జనాభా వివరాలు, చిన్నారులు ఎత్తుకు తగిన బరువు ఉన్నారా? లేదా? అనేది తేలనుంది. తద్వారా పోషక లోపంతో బాధపడుతున్న వారి వివరాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం ఏ మేరకు అందుతుందో ఒక అంచనా ఏర్పడుతుంది. గుడ్లు, పాలు కేంద్రాల నిర్వాహకులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆయా చిన్నారులు, గర్భిణులు, బాలింతల పేరిట ప్రభుత్వం అందిస్తున్న వాటిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం, ఇంటికి తీసుకెళ్లడం వంటివి చేస్తున్నారనే విమర్శలున్నాయి. మరో వైపు ప్రతినెలా చిన్నారుల ఎత్తు, బరువు వివరాలు నమోదు చేయాలి. ఇది నామమాత్రంగా చేపట్టడం వల్ల పోషకలోపంతో బాధపడుతున్న వారి వివరాలు పక్కాగా తెలియడం లేదు. దీంతో చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం పంపిణీ కాక వారు బక్కచిక్కిపోతున్నారు. ఈ ఇబ్బందులను అధిగమించేందుకు సర్వే చేపడుతున్నారు.

సర్వే తీరు ఇది..

సర్వేలో భాగంగా సిబ్బంది ప్రతీ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. మొదట కుటుంబ యజమాని పేరుతో నమోదు ప్రారంభించి తర్వాత సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. వయస్సు, ఫోన్ నంబర్, కులం, ఉపకులం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డ్ నంబర్ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారి వివరాలు సైతం నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ చేపట్టడానికి అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు అందించి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు.

పక్కదారికి అడ్డుకట్ట..

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందించే వస్తువులు ఇకపై పక్కదారి పట్టకుండా ఉంటాయి. గతంలో గర్భిణులు, బాలింతలు రాకపోయినా వచ్చినట్లే రాసేవారు. ఇకపై కేంద్రానికి వచ్చి భోజనం చేస్తేనే హాజరైనట్లు, కేంద్రానికి రాకుంటే చరవాణికి సంక్షిప్త సందేశం వెళ్తుంది. ఈ సర్వేతో తీవ్ర పోషకాహార సమస్యతో బాధపడే పిల్లల సంఖ్య జిల్లాస్థాయిలో తెలుస్తుంది.



సర్వే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

జిల్లా వివరాలు

ప్రాజెక్టు	మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు	మినీ అంగన్‌వాడీ కేంద్రాలు
భైంసా	175	18
ఖానాపూర్	194	37
ముధోల్	154	18
నిర్మల్	252	26

గర్భిణులు : 6,014
బాలింతలు : 5,155
7 నెలల నుండి ఆరేళ్లలోపు చిన్నారులు : 59,129

పక్కాగా నిర్వహిస్తున్నాం



జిల్లాలోని నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 816 అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం సర్వే కొనసాగుతుంది. ఇప్పటికే 90 శాతం సర్వే పూర్తి చేశారు. వివరాలు పక్కాగా ఉండాలని సిబ్బందికి సూచించాం. చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలన్నింటినీ నమోదు చేస్తున్నాం. ఇకపై అవకతవకలకు అవకాశం ఉండదు.
– ఏ.నాగమణి, సీడీపీవో, నిర్మల్

ఫైనల్స్‌లో భారీగా బెట్టింగ్..!

భైంసాటౌన్: ఐపీఎల్ ఫైనల్స్ నేపథ్యంలో ఆదివారం పట్టణంలో బెట్టింగ్ జోరుగా సాగినట్లు వినికిడి. ఈ ఒక్కరోజే రూ.కోట్లలో బెట్టింగ్ జరిగినట్లు తెలిసింది. ఎస్ఆర్‌హెచ్ జట్టు వరుస మ్యాచ్‌లు గెలుస్తూ వస్తుండడంతో ఎక్కువగా ఈ జట్టు గెలుపుపైనే పందెం కాసినట్లు సమాచారం. అయితే సదరు జట్టుపై ఎంతమొత్తం పందెం కాసినా అంతేమొత్తం చెల్లించేలా బెట్టింగ్ కాయగా ప్రత్యర్థి జట్టుపై మాత్రం ఏకంగా ఐదురెట్లు ఎక్కువగా పందెం కాసినట్లు తెలిసింది. దీంతో గెలుస్తుందనుకున్న జట్టు ఓడిపోగా బెట్టింగ్ రాయుళ్లు భారీగా నష్టపోయారు. కానీ నిర్వాహకులకు మాత్రం కాసులు కురిపించిందని సమాచారం. ఏదేమైనా పట్టణంలో బెట్టింగ్ దందా జోరుగా సాగుతున్నా.. అడ్డుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

సుధీర్‌కు తారకరామారావు అవార్డు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన న్యాయవాది సంగెపు సుధీర్ కుమార్ నందమూరి తారకరామారావు అవార్డు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, సత్య సంగీత అధ్యక్షుడు ఓంకార్ రాజు, సినీ ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా చుక్కల దుప్పి మృతి



చుక్కల దుప్పి కళేబరం

నర్సాపూర్(జి): మండలంలోని బామ్ని (బి) అటవీ ప్రాంతశివారు చెరువులోని నీటిని తాగేందుకు వచ్చిన చుక్కల దుప్పి(మచ్చల జింక) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ (జి) గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దుప్పి మృతి చెందిన తీరు చూస్తే హత మార్చారా? లేక పరిగెత్తినప్పుడు చెట్టు కొమ్మ తగిలి మృతి చెందిందా..అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దుప్పి ముఖ భాగంలో గాయమైనట్టు కనబడుతోంది. అటవీ అధికారులు వెళ్లి పరిశీలించగా మృతి చెందిన చుక్కల దుప్పి చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి తిన్నట్టు ఆనవాళ్లు ఉన్నాయి. పంచనామా తర్వాత అసలు విషయం తెలుస్తుందని ఫారెస్ట్ అధికారులు తెలపడం గమనార్హం.

విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతి



ఆవు కళేబరం

బోథ్: మండలంలోని చింగతూడలో విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతిచెందింది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో చేనులో 11 కేవీ విద్యుత్ వైర్లు కిందపడ్డా యి. అక్కడే ఉన్న ఆవుకు వైర్లు తగలి అక్కడికక్కడే మృతి చెందింది. తనకు పరిహారం అందించాలని బాధిత గొడం లక్ష్మణ్ కోరాడు.

ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ విడుదల

- 'ఇంటిగ్రేటెడ్' విద్యపై విద్యార్థుల చూపు
- ఆరేళ్ల సాంకేతిక విద్యతో అద్భుతాలు
- ఏటా వందలాది మందికి ఉద్యోగాలు
- రాష్ట్రవ్యాప్తంగా సీట్ల కోసం పోటీ



భైంసా(ముధోల్): ప్రతిష్ఠాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో నూతన విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి వర్సిటీ అధికారులు సోమవారం ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. జూన్ 1 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.rgukt.ac.in వెబ్‌సైట్‌లో, ఈమెయిల్ ద్వారా admissions@rgukt. ac. in సందర్శించాలని సూచించారు. ఆరేళ్ల సమీకృత(ఇంటిగ్రేటెడ్) ఇంజనీరింగ్ కోర్సు కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు టీజీ ఆన్‌లైన్, మీసేవ, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు ముగిసి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులంతా కోర్సుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కాలేజీలో చదివించాలో.. ఏ కోర్సులు చేయించాలో.. అనే విషయంపై విద్యావేత్తల సలహాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా విద్యార్థుల చదువులపైనే ప్రత్యేక చర్చ కొనసాగుతోంది. తెలంగాణలోనే ఏకైక విద్యాలయ ప్రాంగణాన్ని కలిగి ఉన్న బాసర ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇక్కడ దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చాలామంది తల్లిదండ్రులూ తమ పిల్లలను ఇక్కడే చదివించాలనుకుంటున్నారు.

గ్రామీణ విద్యార్థులకు వరం..

గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించే బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పల్లె విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ సువర్ణ అవకాశంగా మారింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు సంబంధించి బాసర ట్రిపుల్‌ఐటీలో ఏటా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అందులో అర్హత ఉన్నవారిని ఎంపిక చేసి సీట్లను కేటాయిస్తుంది. మూడేళ్లక్రితం ప్రవేశాలకు సంబంధించి మొదటిసారిగా పాలిసెట్ అర్హతను జోడించి సీట్లను కేటాయించారు. అప్పట్లో కోవిడ్ నేపథ్యంలో పాఠశాలలు మూసి ఉండడంతో పదో తరగతి విద్యార్థులను పరీక్షలు లేకుండానే ఉత్తీర్ణులు చేశారు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాలిసెట్ అర్హతను జోడించి సీట్లు కేటాయించారు. ఈ యేడు పాత విధానంలో సీట్లు భర్తీ చేయనున్నారు.

వేల సంఖ్యలో దరఖాస్తులు..

బాసర ట్రిబుల్ ఐటీలో దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2020–21లో 32వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా 2021–22లో 20,178 మంది, 2022–23లో 31,432 మంది, 2023–24లో 32,635 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఏటా భారీగా దరఖాస్తులు

బాసర ట్రిపుల్‌ఐటీలో చదివేందుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆసక్తి కనబరుస్తారు. నోటిఫికేషన్ ప్రక్రియ వెలువడడంతోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇక్కడ సీటు దక్కించుకునేందుకు ఏటా 30 వేలకు పైగానే విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇక్కడ చదివేందుకు పోటీ పడుతున్నారు.– వెంకటరమణ, ఇన్‌చార్జి వీసీ

సమీకృత విద్యావిధానం...

ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్లపాటు ఇంటర్‌తో పాటు సమీకృత ఇంజనీరింగ్ విద్య కొనసాగుతోంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సు నేర్పిస్తారు. అనంతరం అందులో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజనీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు అన్ని వసతులను సమకూరుస్తారు. ల్యాప్‌టాప్, అందరికీ ఒకే రకమైన దుస్తులు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తుంది. చదివే విద్యార్థుల కోసం శారీరక, మానసిక వికాసానికి ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు సైతం తరగతులు నిర్వహిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉన్నాయి.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తోటి, కొలాం, కోలావర్ తెగలకు చెందిన గిరిజన విద్యార్థుల నుంచి గురుకుల పీవీటీజీ ప్రతిభ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30న ఉదయం 10గంటలకు గిరిజన గురుకుల జూనియర్ కళాశాల(బాలికలు) ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు మెమో, బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్‌ఫిట్నెస్, ఆధార్, నిజ ధ్రువీకరణ పత్రాలు, రెండు జతల జిరాక్స్, పాస్‌ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో జిల్లావాసి ప్రతిభ



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న అక్షయ్


నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లో ఈనెల 26న నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ అండర్–30లో జిల్లా కేంద్రానికి చెందిన ధ్యాయత్ అక్షయ్ ప్రతిభ కనబర్చారు. తృతీయ స్థానంలో నిలిచిన ఆయనకు రాష్ట్ర తైక్వాండో సెక్రెటరీ చేతుల మీదుగా మెడల్ స్వీకరించారు. ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అక్షయ్‌ని గురువు నాగరాజును పలువురు అభినందించారు.

భగీరథకు నీటిగండం



పొక్లెన్ సహాయంతో కాలువ తీస్తున్న సిబ్బంది

- కడెం ప్రాజెక్ట్‌లో తగ్గిన నీటిమట్టం
- ఇంటెక్‌వెల్‌కు నీరందక ఇబ్బందులు



కడెం ప్రాజెక్ట్‌లో భగీరథ ఇంటెక్‌వెల్

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో నీటిమట్టం క్రమంగా తగ్గిపోవడంతో..మిషన్ భగీరథకు ఇబ్బందులు పొంచి ఉన్నాయి. గతంలో ఎప్పుడు లేనివిధంగా ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పూర్తిగా తగ్గడంతో భగీరథ ఇంటెక్‌వెల్‌కు నీరందడం లేదు. దీంతో అధికారులు ఇంటెక్‌వెల్‌కు నీరందేలా పొక్లెన్ సహాయంతో కాలువ తీయిస్తున్నారు. బురద నీటిలో పొక్లెన్ వెళ్లేందుకు వీలు లేకపోవడంతో కూలీలతో బురదను తొలగింపజేస్తున్నారు. అయితే కాలువ తీసినకొద్ది నీరు తగ్గిపోవడంతో రానున్న రోజుల్లో భగీరథకు ఇబ్బందులు తప్పేలా లేవు.

మండలాలకు నీటి సరఫరా

కడెం మిషన్ భగీరథ యూనిట్ నుంచి కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, జన్నారం మండలాలకు మిషన్ భగీరథ నల్లా నీరందుతుంది. ఐదు మండలాల్లోని ఆయా గ్రామాల్లో ని సుమారు 30 వేల నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి.

కాలువ తీయిస్తున్నాం

ప్రాజెక్ట్‌లోని రోజురోజుకు నీటిమట్టం తగ్గడంతో ఇంటెక్‌వెల్‌కు కాలువకు నీరందడం లేదు. పొక్లెన్, కూలీల సహాయంతో కాలువ తీయిస్తున్నాం. నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– వెంకటరమణ, డీఈ

వేసవి దుక్కులు పంటకు మేలు

- లోతు దుక్కులతో చీడపీడల నివారణ
- వర్షం నీరు లోతుకు చేరుతుంది
- తెగుళ్ల నివారణకు అవకాశం



నిర్మల్‌చైన్‌గేట్: వేసవి దుక్కులు పంటలకు మేలు చేస్తాయి. నాగళ్ల సాళ్లతో భూమి వదులుగా మారి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. చీడపీడల ప్రభావం తగ్గి పంట దిగుబడి పెరుగుతుంది. జిల్లాలో కొన్నిరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. పొలాల్లో మిగిలిన వ్యర్థాలను కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారడంతోపాటు మట్టిని పెకిలించడం ద్వారా భూమిలో గాలిశాతం పెరుగుతుంది.

లోతుగా దున్నుకోవాలి

పొలాలు చదును చేసుకుని, తొలకరి ముందే విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంటల కోతల అనంతరం భూమిని వృథాగా వదిలేయకుండా లోతుగా దుక్కి దున్నితే పంటలను ఆశించే చీడపురుగులు నివారించవచ్చు. అంతేకాకుండా వర్షాలు కురిస్తే నీరు భూమి లోపలి వరకు చేరుతుంది. మొదటిసారి దుక్కి దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు లేదా చెరువు మట్టిని పొలంలో వెదజల్లడం ద్వారా మంచి దిగుబడి వస్తుంది.

మూడు రకాల దుక్కులు..

వేసవి దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వర్షపు నీరు భూమిలో ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జక వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా మారి భూమిలోకి చేరుతాయి. అవి భూసారవృద్ధికి తోడ్పడుతాయి.

పత్తి, వరి మొదళ్లను భూమిలో కలపాలి

ఏటా పత్తి దిగుబడి అనంతరం రైతులు పత్తి కట్టెను కోసి తగులబెడుతుంటారు. అలా కాకుండా భూమిలో తేమ ఉన్నప్పుడు రోటోవేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేయడం వల్ల భూమి సారవంతం పెరగడమే కాకుండా రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించవచ్చు. వరి పంట కోసిన తర్వాత వరి మొదళ్లను భూమిలో కలిపి దున్నాలి.

సేంద్రియ ఎరువుల వాడకం..

సేంద్రియ ఎరువులు నేల లోపలకు వెళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు స్థూల, సూక్ష్మపోషకాలు అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవ గుణాలపై ప్రభావం చూపి నేల సత్తువ, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. పశువుల ఎరువులు, కోళ్లు, గొర్రెలు, మేకల, వానపాముల ఎరువులను ఎకరాకు సుమారు 2–4 టన్నుల వరకు వాడవచ్చు. విత్తడానికి 20–25 రోజుల ముందే సేంద్రియ పదార్థం వాడటం వల్ల భూమి గట్టి పడకుండా వదులుగా ఉంటుంది. నీరు బాగా ఇంకడం వల్ల తేమశాతం పెరిగి విత్తనం బాగా మొలకెత్తుతుంది.

విత్తన ఎంపిక ప్రధానం..

సాగులో విత్తనాల ఎంపిక ప్రధానం. పలు రకాల కంపెనీల విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆయా కంపెనీల డీలర్లు రైతులను ఆకట్టుకునేలా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలను అందిస్తుందనే విషయంలో రైతులకు అవగాహన లేకుండా పోతోంది. ఏటా ఏదో ఒక కంపెనీ విత్తనాలను వేసుకునేకంటే నాణ్యమైనవి వేయాలి.

వరి కొయ్యలు కాల్చొద్దు

వరి కొయ్యలను పొలంలో కలియదున్నితేనే పంటకు మేలు. పంట దిగుబడి పెరుగుతుంది. వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గడంతోపాటు పంట దిగుబడి తగ్గే ప్రమాదముంది. పొలాలను వేసవిలో దున్నుకోవాలి. నేలలో ఉన్న పురుగులు చనిపోతాయి. రైతులు జీలుగ విత్తనాలు వేస్తే భూములు సారవంతమవుతాయి.

– నాగరాజు, ఏవో

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రవీణ్‌గౌడ్(ఫైల్)

మామడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని దిమ్మదుర్తి గ్రామానికి చెందిన అల్లకొండ ప్రవీణ్‌గౌడ్(30) తన మిత్రుడు శేఖర్‌గౌడ్‌తో కలిసి బైక్‌పై నిర్మల్‌కు వెళ్లి పని ముగించుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. సోమవారం ఖానాపూర్ నుంచి బొలెరో వాహనం నిర్మల్‌కు వెళ్తుండగా మామడ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. బైక్ నడుపుతున్న ప్రవీణ్‌గౌడ్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్‌గౌడ్ కాలి గాయమైంది. ఎస్సై సందీప్ ఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తెల్లారితే గల్ఫ్‌కు వెళ్లేవాడు..

ప్రవీణ్‌గౌడ్‌ది పేద కుటుంబం. చిన్నవయసులో తండ్రి మృతి చెందాడు. ఆయనతోపాటు తమ్ముడు, చెల్లిని తల్లి పెంచి పోషించింది. కుటుంబ పోషణ నిమిత్తం ప్రవీణ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయనకు ఇటీవల పెళ్లి జరిగింది. తల్లి అనారోగ్యంతో బాధపడుతుంది. గల్ఫ్ నుంచి నాలుగు నెలలకోసారి స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఈక్రమంలో 15 రోజుల క్రితం రాగా, మంగళవారం అక్కడికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. జిల్లా కేంద్రంలో పనిచేసుకుని తిరిగి మామడ వరకు చేరుకున్నారు. మరో 3 కి.మీ ప్రయాణిస్తే ఇంటికి చేరుకునేవాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. ఆయన మృతితో కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసు ఇన్‌చార్జి భోజన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఉండం–ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, ఆయన కుడిచేతిపై పచ్చబొట్టు ఉందని, శరీరంపై నల్లని గీతల ఫుల్ షర్టు, యాష్ రంగు ప్యాంట్ ఉందని అన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. సంబంధీకులు ఎవరైన ఉంటే సెల్: 9440442722పై సమాచారం అందించాలని సూచించారు.

పురుగుల మందుతాగి యువతి

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్ నవెగాం గ్రామానికి చెందిన సుష్మ (16)ని తల్లిదండ్రులు సోమవారం వ్యవసాయ పనులకు రమ్మనడంతో వెళ్లలేదు. తండ్రి అర్జున్ మందలించడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబీకులు గమనించి జిల్లాస్పత్రికి, మంచిర్యాలకు రెఫర్ చేశారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడవ జోన్‌కు చెందిన మేకల రవి (47) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై మజీద్‌ఖాన్ కథనం ప్రకారం..కూలీ చేసుకునే రవి తాగుడుకు బానిసయ్యాడు. తరచూ డబ్బుల కోసం భార్యను వేధించసాగాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవకు దిగాడు. మద్యం మత్తులో గడ్డి మందు తాగగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఎండదెబ్బతో యాచకుడి మృతి

వాంకిడి: ఎండదెబ్బ తగిలి ఓ వృద్ధ యాచకుడు మృతి చెందినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన గేడం కుర్‌కుడె శ్రీ గణేశ్(75) ప్రతీ రోజు భిక్షాటన చేసుకుని జీవనం గడిపేవాడు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని మహారాష్ట్ర బస్సులు ఆగే బస్టాండ్‌లో శ్రీ గణేశ్ పడి ఉండటాన్ని తమ్ముడి కుమారుడు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. శ్రీ గణేశ్ కుమారుడు గేడం సచిన్ అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఎండ దెబ్బ తగిలి చనిపోయి ఉంటాడని మృతుడి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సచిన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: కుటుంబ, ఆర్థికసమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రమేశ్ కథనం ప్రకారం..కరీంనగర్‌లో నివాసం ఉంటున్న జడ్డపాటి జానయ్య అలియాస్ జాన్ (38) ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అంతకు ముందు జాన్ బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి గంగారాంనగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. కొన్ని నెలల క్రితం కరీంనగర్‌కు వలస వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత తన భార్యతో నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. భార్య తిర్యాణిలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన జాన్ బెల్లంపల్లిలోని ఇంట్లో రాత్రి గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



కేక్ కట్ చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ

ఆదిలాబాద్‌టౌన్: నర్సుల సేవలు వెలకట్టలేనివని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రిలో నర్సింగ్ డేను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వైద్యుడు రోగికి వైద్యం చేస్తే నర్సులు దగ్గరుండి మిగతా సేవలందిస్తారని కొనియాడారు. వారు కోలుకునే వరకు వైద్యం అందిస్తారని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ఆదర్శంగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ, స్టాఫ్‌నర్సులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌గంగ నదికి నైవేద్యాలు



నదిలో నైవేద్యం సమర్పిస్తున్న రైతు కుటుంబం

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె), వడూర్, అంతర్గాం, గొల్లఘాట్ గ్రామాల సరిహద్దు గుండా ప్రవహిస్తున్న పెన్‌గంగ నదికి రైతు కుటుంబీకులు, భక్తులు సోమవారం పూజలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నదికి నైవేద్యాలు సమర్పించారు. దీపాలు వెలిగించి తెప్పలపై ఉంచి నదిలో వదిలారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సకాలంలో వర్షాలు కురవాలని గంగాదేవిని వేడుకున్నారు. అనంతరం నది నీటిని తీసుకెళ్లి రైతులు వారి చేన్లలో చల్లుకున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నదికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.